సరస్వతి దేవి విగ్రహా ప్రతిష్ట

విశాలాంధ్ర - తగరపువలస : భీమిలి మండలం గొల్లల పాలెంలో ఉన్న కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చందవరపు కుమార్ ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహా ప్రతిష్ట నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీమతి గంగా కుమారి మాట్లాడుతూ విగ్రహా ప్రతిష్టకు చైర్మన్ వైస్ చైర్మన్ కమిటీ మెంబర్లు మరియు స్టాఫ్ అందరి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ విషయం తెలుసుకున్న సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె. చంద్ర శేఖర్ రావు జీసీడిఓ కలీషా బేగం శుభాకాంక్షలు తెలియజేశారని ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలియజేసారు. ఈ పూజా కార్యక్రమంలో టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల సమస్యలపై మార్చి 4 నుండి 11 వరకు ధర్నాలు

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు

విశాలాంధ్ర - విశాఖ : అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై మార్చి 4 నుండి 11వ తేదీ వరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నాలను నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి ఎస్ జె అచ్యుతరావు తెలిపారు. అల్లిపురంలోని ఏఐటియుసి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ తేదీన మహా ధర్నాలో అసంఘిక రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐలను కట్టుదిట్టంగా అమలుచేయాలని, సింక్ లీవు, ఏర్పడితే లీవు, క్యాజువల్ లేవు, వారాంతపు సెలవులు కచ్చితంగా అమలు చేయాలని, సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఆటో మోటార్ కార్మికులకు మెడకు ఉరితాడుగా ఉన్న జీవో నెంబర్లు 21,31 లను రద్దు చేయాలని, ముఠా, ఆటో, మోటార్, తోపుడు బళ్ళ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి చట్టాన్ని రూపొందించాలని, ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఏ కంపెనీలో అయినా ప్రమాదంలో ఏ కార్మికుడైన చనిపోతే కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి తక్షణమే వారి రిక్లెయిమ్‌లను చెల్లించాలని, చనిపోయిన సివిల్ సప్లై హమాలీలకు పి.ఎఫ్. ద్వారా పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల అమలకు కార్మికులంతా ఐక్యంగా ఉండి ఆందోళనలు నిర్వహించడం ద్వారానే హక్కులు సాధించుకోగలమని అన్నారు. విలేకరుల సమావేశంలో ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షులు మన్మధరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, ఉపాధ్యక్షులు షేక్ రహమాన్, కార్యదర్శి పడాల గోవిందు, సిహెచ్ కాసుబాబు, ఎస్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధన మృతులు ఆదర్శనీయులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎంఆర్‌పిఎస్ ప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు తౌలుత కూర్మన్న పాలెం కూడలిలోనీ డా .బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎం ఈ ఎఫ్ ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎం.ఈ.ఎఫ్ విశాఖ అధ్యక్షులు అత్తోట రవి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో ఉక్కు సి.జి.ఎం ఎంఎస్ ప్రసాద్, డి.వసంతరావులు ముఖ్య అతి థులుగా హాజరై మాట్లాడుతూ ఎం.ఆర్‌పి ఎస్ 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు నివాళులు అర్పించడం మన బాధ్యతని అన్నారు. వారి ఆశయ సాధనకు మన మంతా కృషి చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం. తాతి బాబు, డి.సంపూర్ణం, జి.ప్రసాద్, ఎస్. రాజా రావు, ఏ.దీపక్,కె.రాజ శేఖర్, డి.రాజేష్ బాబు,కె.వి రత్నం, టి.సత్యనారాయణ, కె.సురేష్, ఎన్ అప్పారావు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయంలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత

విద్యార్థులు తరగతులకు పూర్తి స్థాయిలో హాజరు కావాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం : ప్రతి విభాగాన్ని అభివృద్ధి చేస్తాం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్య సంబంధిత క్రమశిక్షణను పెంపొందించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. సోమవారం ఉదయం ఇంజనీరింగ్ కళాశాల, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, ఆచార్యులతో సమావేశ మయ్యారు. మధ్యాహ్నం ఫార్మసీ, న్యాయ, ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, ఆచార్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రతి విభాగంలో వసతులు కల్పన, తదితర అంశాలకు సంబంధించిన వివరాలను, వినతులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విభాగాలలో తరగతులు పటిష్టంగా నిర్వహించాలని, విద్యార్థులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరుకావాలని సూచించారు. ప్రతి తరగతిలో విద్యార్థులు పాటించవలసిన నియమావళిని వివరించాలని, దీనిని విద్యార్థులు అందరూ అనుసరించే విధంగా ఆచార్యులు, విభాగాధిపతి చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు నిత్యం తరగతులకు వస్తేనే వారి నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని, భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను, ఉపాధి అవకాశాలను పొందడానికి వీలవుతుందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని, ప్రతి విభాగంలో ఉన్న సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగు పరచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం జరుగుతుందని స్పష్టం చేశారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్నాయని ఈ ప్రక్రియలో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలని అందరి సహకారంతో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎన్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, జి. శశిభూషణరావు, జి.గిరిజ శంకర్, ఎం.వి.ఆర్ రాజు, కె.సీత మాణిక్యం, డి.నగరాజకుమారి, అర్. పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చీమలాపల్లిలో ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95 వ వార్డు చీమలాపల్లిలో ప్రభుత్వ భూములు ఆక్రమణలను సోమవారం ఉదయం రెవెన్యూ అధికారులు తొల గించారు. సర్వే నెంబర్ 50 లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొందరు వ్యక్తులు షెడ్లు నిర్మించారు. దీనిపై పెద్ద ఎత్తున ప్రజలు ఫిర్యాదులు చేయడంతో పాటు మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు జెసిబి తీసుకెళ్లి షెడ్లను నేలమట్టం చేశారు. రెవెన్యూ అధికారులు చర్యలపై చీమలపల్లి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం : విద్యార్థులు కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చేలా తల్లితండ్రులు ఉపాధ్యాయులు తగు శ్రద్ధ తీసుకోవాలని ఎల్వీపీఈఐ వైద్యులు డాక్టర్ హిమబిందు అల్లూరి సూచించారు. ఈ మేరకు విద్యార్థులు, వారి కంటి ఆరోగ్యంకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై సోమవారం నగరంలోని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో, లక్షలాది మంది విద్యార్థులు తమ సంవత్సరాంత పరీక్షలకి సిద్ధపడుతున్న సమయంలో కంటి ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఎక్కువ గంటలు చదువుతూ ఉండే ఈ సమయం ఆందోళన, ఒత్తిడితో కూడుకున్నదన్నారు. సుదీర్ఘమైన అధ్యయన సెషన్లతో పాటు డిజిటల్ అభ్యాసం, స్క్రీన్ సమయం ఫలితంగా విద్యార్థులు కంటి అలసట బారిన పడుతున్నారన్నారు. పొడి కళ్ళు, తలనొప్పులు, చెదిరిన చూపు, మైగ్రేన్ల వంటి లక్షణాలు సర్వసాధారణ సమస్యలవు తున్నాయన్నారు. పరీక్షకు తయార వుతున్న సమయంలో కంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికి సామర్థ్యాన్ని పెంచడానికి, సమగ్రమైన ఒక కంటి పరీక్ష చేయించుకోవడం,20-20-20 నిబంధన, ప్రతి 20 నిమిషాలకు 20 అడుగుల దూరంలో ఉన్నదానిని 20 సెకన్ల పాటు చూడటం, తరచుగా రెప్పలు ఆర్పడం, వెన్నుముక సరైన భంగిమ లో ఉంచడం, డిజిటల్ సాధనాన్ని పరిమితంగా ఉపయోగించడం, ఎయిర్ కండిషనింగ్ నేరుగా తగలకుండా జాగ్రత్త పడటం, బాగా వెలుతురు ఉన్న గాలి ప్రసరణ ఉన్న గదులలో కూర్చోవడం, శారీరిక శ్రమ నిద్రకు ప్రాధాన్యత ఇవ్వడం, తగినంత నీరు ఇతర,ద్రవాలు తీసుకోవడం వంటివి చేయాలని సూచించారు. దీంతో కంటి ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు.

టి.నగరపాలెం పంచాయతీ తారు రోడ్డు ప్రక్షాళన

విశాలాంధ్ర - తగరపువలస : టి.నగరపాలెంలో చాలా సంవత్సరాల నుంచి రోడ్డుకి ఇరువైపుల రోడ్డుపై ఇల్లు నిర్మాణం చేసి ఆక్రమణకు గురైంది. రోడ్డుకి ఇరు వైపులా మూడు అడుగుల బెర్త్ మట్టి రోడ్డు ను గ్రావెల్ తో పూరించి స్కూల్ బస్సులు,ఇతర వాహనాదారులూ కు ప్రయాణం చేయిటకు ప్రజలు కు ఇబ్బంది లేకుండా నాయకులు తొలిగించారు. ఈ కార్యక్రమములో స్థానిక నాయకులు గ్రామ పెద్దలు పోట్నూరు చంద్రశేఖర్ చాయగౌతమి పంచాయతీ సర్పంచ్ మరియు పల్ల నీలిమ సన్యాసి రావు ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ బోర్డు మెంబర్ పూసర్ల రామారావు యాదవ్ తెలుగు యువత కోరాడ రామకృష్ణ ,పల్ల పోతురాజు పాల్గొన్నారు.

సింహాద్రి నాధుని ఆలయ పైకప్పు లీకేజి పనులు చకచక

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి స్వామివారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్న పురాతన కట్టడాల స్లాబ్ (పై కప్పు) లీకేజి మరమ్మత్తులు చక చక జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని పూణేకు చెందిన లార్డ్ వేంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ ఈ పనులను ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చింది. పురాతన ఆలయాల మరమ్మతులకు అనుసరించే విధానాలతో పనులు చేపట్టనుంది. ఈమేరకు దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ జి.వి.ఆర్.శేఖర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రానురాను ఆలయం పైభాగంలో రంధ్రాలు ఏర్పడి వర్షం నీరు లోపలకి చేరుతోంది. ముఖ్యంగా ప్రధాన ఆలయంతో పాటు కల్యాణమండపంలో, వంటశాలలో నీరు చేరుతోంది. సుమారు ఇరవై ఐదేళ్ల క్రితం అప్పటి ఈవో వి. శంకరరెడ్డి శాండ్ బ్లాస్టింగ్ పనులు చేయించి కొంతమేర లీకేజీలను సరిదిద్దారు. కానీ ఆ పనులు ద్వారా పూర్తిస్థాయిలో ఆశించినంత ఫలితాలు రాకపోవడంతో మళ్లీ పరిస్థితి యథాస్థితికి వచ్చింది. 2009లో అప్పటి ఈవో దివంగత ప్రేమ్ కుమార్ హయాంలో ఫోర్స్ రాక్ సిస్టం పద్ధతిలో ప్రత్యేక మెటరియల్ ను రంధ్రాలు ద్వారా పంపి ఆలయ బేడామండపం తదితర ప్రదేశాల్లో లీకేజీలను సరిదిద్దారు. ఆ విధానంతో కొన్నేళ్ల పాటు లీకేజీలు తగ్గుముఖం పట్టాయి. కొన్నిచోట్ల ప్రతీ ఏడాది కురుస్తున్న వర్షాలకు మళ్లీ వర్షం నీరు లోపలకి వచ్చి చేరుతోంది. ముఖ్యంగా ప్రధాన ఆలయం, కల్యాణ మండపం, వంటశాలలో వర్షం నీరు లోపలికి వస్తోంది. దీంతో రాష్ట్ర దేవదాయశాఖ, సింహాచలం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు ఈ విషయంపై పూణేకు చెందిన లార్డ్ వేంటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్టును సంప్రదించారు. ఆ ట్రస్ట్ ఇప్పటికే శ్రీకాళహస్తి, శ్రీశైలం దేవస్థానాల్లో మరమ్మతు పనులు చేసింది. దాంతో ఆ సంస్థ ప్రతినిధులు వేంకటేశ్వరరావు, జమీల్ గత ఏడాది నవంబరులో సింహాచలం వచ్చి ఆలయ పైకప్పు, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. పురాతన ఆలయాల మరమ్మతులకు అనుసరించే పద్ధతులతో మరమ్మతులు చేయాలని వారంతా భావించారు. అలాగే శాస్త్రపరంగా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కెమికల్ ట్రీట్మెంట్ ద్వారా పనులు పూర్తిచేయడానికి సంసిద్ధమయ్యారు. సిమెంట్ తో సంబంధం లేకుండా కరక్కాయ, తేనె కొన్ని మూలికలు మాత్రమే ఉపయోగించి పనులు పూర్తి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రధాన ఆలయంతో పాటు వంటశాల, కల్యాణ మండపంలో కెమికల్ ట్రీట్మెంట్ పనులు చేస్తున్నారు. కాగా ఆలయ చరిత్ర, శిల్పశాస్త్రానికి ఎలాంటి విఘాతం కలగకుండా పనులు చేయాలని దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, దేవదాయశాఖ స్థపతులు, ఆలయ వైదిక వర్గాల సూచనలు స్పష్టంగా పాటిస్తూ, తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో చీఫ్ ఇంజనీర్ ఆదేశించిన సంగతి పాఠకులకు తెలిసిందే.

భర్త ఆచూకీ కోసం మహిళ ఫిర్యాదు

విశాలాంధ్ర - పెందుర్తి : డ్యూటీ కి వెళ్ళిన భర్త నరవ శివప్రసాద్ ఇంటికి తిరిగి రాలేదని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప నగర్ కు చెందిన నరవ జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శివప్రసాద్ ఈనెల 1న నగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో విధులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు స్నేహితుల ఇళ్లల్లో వెతికిన ఆచూకీ లభించక పోవడంతో జయలక్ష్మి ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శివప్రసాద్ ఆచూకీ తెలిసినవారు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

డీమ్డ్ విశ్వవిద్యాలయంగా హిందూజా కళాశాల

విశాలాంధ్ర - విశాఖపట్నం : విద్యలో 75 సంవత్సరాల సుధీర్ గా అనుభవంతో హిందూజా గ్రూప్ తన ప్రధాన సంస్థ హిందూజా కాలేజ్ ఆఫ్ కామర్స్ ద్వారా భారతదేశ భవిష్యత్తును రూపొందించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ విస్తరణ ప్రణాళికలు రూపొందించినట్టు ఆ విద్యా సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఇది శరణార్థుల పిల్లలకు వినయపూర్వకమైన ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమైందన్నారు. ఈ రోజు 6000 మంది విద్యార్థులతో, హిందూజా కళాశాల ఇప్పుడు డీమ్డ్ విశ్వవిద్యాలయంగా మారడానికి ముందుకు వస్తోందన్నారు. ఈ రోజు హిందూజా ఫౌండేషన్ ద్వారా ఈ బృందం భారతదేశం అంతటా 7,00,000 మంది విద్యార్థులను పాఠశాల నుండి పాఠశాల నుండి రహదారి మరియు జీవనోపాధి వంటి కార్యక్రమాల ద్వారా పెంపొందిస్తుందన్నారు. 2030 నాటికి 1 మిలియన్ విద్యార్థులను శక్తివంతం చేయాలనే ప్రతిష్టాత్మక ప్రణాళికలతో, హిందూజా ఫౌండేషన్ మార్పుకు ఉత్ప్రేరకంగా ఛాంపియన్ విద్యను కొనసాగిస్తోందన్నారు. ప్రత్యేక కోర్సులతో పాటు కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ మరియు సంపద నిర్వహణలో కొత్త కార్యక్రమాలను ప్రవేశపెట్టాలని కళాశాల యోచిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో హిందూజా ఫౌండేషన్ చైర్మన్ అశోక్ హిందూజా, అధ్యక్షులు పాల్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

బ్లూ ఫ్లాగ్ గుర్తింపులో అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖ పట్నం : రుషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పునరుద్ధరణలో చోటు చేసుకున్న పొరపాట్లు భవిష్యత్ లో పునరావృతం కాకూడదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అసెంబ్లీ జీరో అవర్ లో ఆయన మాట్లాడుతూ దేశంలోని 10 బ్లూ ఫ్లాగ్ బీచ్ లలో ఒకటైన రుషికొండ బీచ్‌ను సెలవు రోజుల్లో 70 వేల నుంచి లక్ష మంది టూరిస్టులు సందర్శిస్తారని తెలిపారు. బీచ్ లో సీసీ కెమెరాలు, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, పార్కింగ్ వంటి ప్రమాణాలు సరిగా లేనందున బ్లూ ఫ్లాగ్ గుర్తింపు తాత్కాలికంగా రద్దయ్యిందన్న వార్త ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. గుర్తింపు రద్దవడం వల్ల రుషికొండ బీచ్ కు టూరిస్టుల సందర్శనపై ప్రభావం పడుతుందన్నారు. టూరిజం శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టినప్పటికీ, ఇలా ఎందుకు జరిగింది, బాధ్యులు ఎవరు అనేది గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. బ్లూ ఫ్లాగ్ కమిటీ గుర్తింపు పునరుద్ధరించేలా బీచ్ లో ప్రమాణాలను పాటించాలని, బ్లూ ఫ్లాగ్ గుర్తింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టూరిజం, ఐటీ విశాఖ అభివృద్ధికి రెండు కళ్లని గంటా చెప్పారు.

పరిహారం కోసం రైతుల ఆందోళన

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి మండలం పోర్లుపాలెం, చీమలపల్లి, చింతల అగ్రహారం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతులు ఆందోళన బాట పెట్టారు. పెందుర్తి సింహాచలం నార్త్ రైల్వే స్టేషన్ల మధ్య ఫ్లైఓవర్ నిర్మాణానికి తమ అనుభవంలో ఉన్న సాగు భూముల్లో సర్వే చేశారంటూ నిరసన చేపట్టారు. తమకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా, సమాచారం లేకుండా తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్న భూముల్లో ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు పూనుకోవడం విచారకరమని వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్కు పెందుర్తి రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఆ భూములు సింహాచలం దేవస్థానానికి చెందినవంటున్న అధికారులు, అనుభవం హక్కు గానైనా తమకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. గతంలో అటు సింహాసనం దేవస్థానానికి ఇటు రైతులకు సమానంగా పరిహారం చెల్లించారని తెలియజేశారు. దీనిపై మంగళవారం ఉదయం పెందుర్తి రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని రైతులు వెల్లడించారు.

మందు బాబులు 35 మందికి 3 లక్షల 50 వేలు జరిమాన

విశాలాంధ్ర - ఆనందపురం : మందు బాబులకు జరిమానా విధిస్తూ భీమిలి 15వ ఆదనపు మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ డి. సౌజన్య తీర్పునిచ్చారు ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 35 మందిపై కేసు నమోదు చేసి కోర్టు హాజరుపరచుగా ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి డి.సౌజన్య తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పాపారావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

శ్రీనూకాంబికా ఆలయ పునఃప్రతిష్టోత్సవం

మార్చి 7 నుండి 10 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

విశాలాంధ్ర - మధురవాడ : మధురవాడ , మిధిలాపురి ఉడా కోలని ,బింద్రానగర్,షిప్ యార్డు లే అవుట్ లో ఈ నెల(మార్చి) 7వ, తేదీ నుండి 10 వరకు శ్రీశ్రీశ్రీ విజయగణపతి, ఏకశిల నాగాభరణ, శివలింగము,శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ సంతాన నాగేంద్ర స్వామి, శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ సముదాయ పునః ప్రతిష్టా మహోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించ నున్నట్లు ఆ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం వో ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామ శర్మ ఆధ్వర్యంలో, సర్వ బ్రహ్మశ్రీ ఇప్పిలి సాయికిరణ్ శర్మ,అర్జింగి జగదీశ్వర్ ల పర్యవేక్షణ లో 12 మంది వేద పండితులతో పునః ప్రతిష్టా మహోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించ నున్నట్టువారుతెలిపారు. ప్రతిష్టామహోత్సవ వివరాలు. మొదటి రోజు 7వ తేదీ శుక్రవారం సాయంత్రం విఘ్నేశ్వరపూజ,పుణ్యాహవాచనం, పరిషత్, కృచ్ఛ్రత్రయం, పంచగవ్యారాధన, రక్షాసూత్ర పూజ ధారణ, రుత్విక్ వరుణ,దీక్షాధారణ, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు. రెండవ రోజు శనివారం ఉదయం సుప్రభాతసేవ, వేదపారాయణ, మండవ అర్చనలు, వివిధ హోమములు, వేదపారాయణ, మేళతాలు, సాంస్కృతికార్యక్రమాలు,బాణాసంచాల తో గ్రామ ప్రదక్షిణ అనంతరం క్షీరాదివాసం, ప్రసాద వితరణ. అదే రోజు సాయంత్రం నుండి విశేష అర్చనలు, హోమాలు, శ్రీ మహాలింగార్చన, భేరీ మూర్తులకు అభిషేక, ధాన్యా,పుష్పాదివాసం, అష్టదిగ్బలి,వేదస్వస్తి, తీర్ధ ప్రసాద వితరణ. మూడవ రోజు ఆదివారం : ఉదయం సుప్రభాతసేవ, వేదపారాయణ, హోమములు, సౌర, అరుణ,మంత్రాహనాలు, ఆదివాస హవనములు, సూర్య నమస్కారములు అనంతరం అష్టబంధన కార్యక్రమం జరగనుంది.

ఏయూలో దిశ విద్యార్థి సంఘం యూనిట్

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దిశ విద్యార్థి సంఘం సభ్యులు వర్సిటీ విభాగ యూనిట్‌ను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విద్యార్థి సంఘం యొక్క ఆవశ్యకత గురించి, ప్రత్యేకంగా ఒక స్వతంత్ర విప్లవ విద్యార్థి సంఘం యొక్క ఆవశ్యకత గురించి చర్చ జరిగింది. విద్యార్థుల తక్షణ సమస్యలపైనే కాక, ఆ సమస్యల మూలాలపై కూడా దిశ విద్యార్థి సంఘం పోరాడుతుందని, భగత్ సింగ్ తదితర విప్లవకారుల త్యాగాల వెలుగులో వారు కాంక్షించిన నూతన సమాజ నిర్మాణం కోసం పనిచేస్తుందని సభ్యులు వివరించారు. రాజకీయ పార్టీలకు అనుబంధ సంస్థలా కాక, అందరికీ ఉచిత, సమాన విద్య, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ వంటి డిమాండ్లతో కూడిన ఒక కామన్ మినిమం ప్రోగ్రామ్ ఆధారంగా దిశ పనిచేస్తుందని వివరించారు. దిశ లక్ష్యాలతో, ఈ ప్రోగ్రాం ఆధారంగా పనిచేయడానికి సిద్ధపడ్డవారికి సభ్యత్వం ఇచ్చినట్టు చెప్పారు. అనంతరం యూనిట్ ఇన్చార్జిగా ఎన్నుకోబడిన అవినాష్, అమరవీరులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల స్మృతి తో చేయబోయే కార్యక్రమాలను ప్రతిపాదించారు. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాలతో పాటు సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ కూడా చేపట్టనున్నట్టు తెలిపారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు హ్యాట్రిక్ విజయం

కూటమి మద్దతు అభ్యర్థి రఘువర్మకు ఎదురు దెబ్బ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో తొలిసారి రాజకీయ పార్టీల ప్రమేయం తో ఎన్నికలు జరిగినప్పటికీ, ఉపాధ్యాయులు రాజకీయ పార్టీల మద్దతు అభ్యర్థిలను ఓడించి తమ సంఘ సేవకు ఉపయోగపడే గాదే శ్రీనివాస నాయుడు ను గెలిపించుకున్నారు. గడిచిన ఆరేళ్ళుగా ఎమ్మెల్సీగా పనిచేసిన పాకలపాటి రఘువర్మకు కూటమి పార్టీలైన టిడిపి, జనసేన మద్దతు ప్రకటించి, విస్తృత ప్రచారాన్ని నిర్వహించి రాజకీయ రంగుతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించినప్పటికీ ఆయన ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నిక ఫలితాలు ఉత్కంఠ భరితంగా సోమవారం ఉదయం నుండే సాగాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు నాయుడు మరోసారి తన రాజకీయ నైపుణ్యాన్ని చాటుకున్నారు. 2007, 2013లో ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన 2025లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ పూర్తి చేశారు. ఉపాధ్యాయ సంఘాల మద్దతు, ఆయన నిబద్ధత, గత పాలనలో చేసిన సేవలు ఈ విజయానికి కారణమయ్యాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో స్వల్ప ఆదిత్య సాధించిన శ్రీనివాసల నాయుడు రెండో ప్రాధాన్యత ఓట్లలో కూడా అదే ఆధిక్యతతో కొనసాగి విజయం దిశగా దూసుకుపోయారు. సోమవారం ఉదయం ఏయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ భద్రత నడుమ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. తాజా గణాంకాల ప్రకారం, 9వ రౌండ్ వరకు జరిగిన లెక్కింపులో గాదె శ్రీనివాసులు నాయుడు 9,237 ఓట్లతో విజయం సాధించారు. ఆయన ప్రధాన ప్రత్యర్థి పకాలపాటి రఘువర్మ 8,527 ఓట్లు సాధించారు, అయితే గెలువు కోసం కావాల్సిన అంకె దాటలేకపోయారు. మొత్తం 10,068 ఓట్లు గెలువు క్వాటాగా నిర్ణయించగా, నాయుడు ఫైనల్ రౌండ్ వరకు ఆధిక్యంలో నిలిచారు. కౌంటింగ్ కేంద్రం నుంచి సమీప అభ్యర్థి పాకలపాటి రఘువర్మ వెనుతిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇచ్చిన ఈ తీర్పును గౌరవిస్తానని, గెలుపొందిన శ్రీనివాసలు నాయుడుకు అభినందనలు తెలియజేశారు. రాత్రి 9 గంటల వరకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. 710 ఓట్ల ఆదిక్యంతో ఉన్న శ్రీనివాసులు నాయుడు తుది ప్రకటన వెలువడాల్సి ఉంది. శ్రీనివాసులు నాయుడు గెలుపు దాదాపు ఖరారు కావడంతో ఆయన వర్గీలంతా సంబరాలు జరుపుకున్నారు. ఎస్‌టియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమంది పైడి రాజు సారధ్యంలో ఏ యు ప్రాంగణంలో శ్రీనివాసలు నాయుడు గెలుపుతో సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల్లో ఎస్ టి యు శ్రీనివాసలు నాయుడు గెలుపు కోసం విశేష కృషి చేసింది.

ఎలిమినేట్ అయిన అభ్యర్థులు....

ఈ పోటీలో పలు కీలక అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. కోరెడ్ల విజయ గౌరి కి 5900 ఓట్లు లభించాయి. ఆమె 8వ రౌండ్‌లో ఎలిమినేట్ కాగా, డా. కొసురు రాధాకృష్ణ 3వ రౌండ్‌లో ఎలిమినేట్) అయ్యారు. దుర్గారావు పోతల 6వ రౌండ్‌లో ఎలిమినేట్ కాగా, నూకల సూర్యప్రకాశ్ 7వ రౌండ్‌లో ఎలిమినేట్ అయ్యారు. ఎస్.ఎస్. పద్మావతి 2వ రౌండ్‌లో ఎలిమినేట్ కాగా, పెడపెంకి శివ ప్రసాద రావు 1వ రౌండ్‌లోనే ఎలిమినేట్ అయ్యారు. రాయల సత్యనారాయణ 4వ రౌండ్‌లో ఎలిమినేట్ కాగా, డా. సుంకర శ్రీనివాసరావు 5వ రౌండ్‌లో ఎలిమినేట్ అయ్యారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మూడవసారి ఎన్నికైన గాదె శ్రీనివాసులు

విశాలాంధ్ర - తగరపువలస : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రోగ్రెసివ్ రికగ్నైజేడ్ టీచర్స్ యూనియన్ తరుపున పోటీ చేసి ప్రధాన మిత్ర సంఘాలు ఆపస్, ఎస్.టి.యు, ఏ.పి.టి.ఎఫ్ 1938ల సహకారంతో అఖండ విజయం సాధించిన గాదె శ్రీనివాసులునాయుడుకి భీమునిపట్నం అర్బన్ మరియు రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డిపల్లి అప్పలరాజు, ఎం.రమాదేవి, ఎస్.రాజేంద్రప్రసాద్, ఎస్.రమణా రావు సీనియర్ నాయకులు పొట్నూరు మురళీమోహనరావు రొంగలి అప్పారావు, కె.సన్యాసినాయుడు, గరికన వరదేశి, ఇమంది వెంకట్రావు, ఆల్తి రామకృష్ణ, గూన ప్రభాకర్ రావు,ఎస్.ఉదయ్ కుమార్, భాస్కర్ రావు, వెంకట రమణ అభినందనలు తెలియజేశారు. ప్రతి ఒక ఉపాధ్యాయుడు శ్రీనివాసుల నాయుడు విజయానికి కష్టపడ్డారని ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నట్లు జిల్లా ఎస్.టి.యు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ .స్వామి, ఇమంది పైడిరాజు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే వ్యక్తిగా అందరి దగ్గర మంచి పేరు ఉందని ఉపాధ్యాయ పక్షపాతిగా శ్రీనివాస నాయుడు ఉంటారని విశాఖపట్నం జిల్లా వి.ఆర్.టి.యు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తెలియజేశారు.